## క్లుప్తంగా

### త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఫ్రీ లీగల్ ఎయిడ్ ద్వారా అందించే కేసుల త్వరితగతిన పరిష్కారానికి ప్యానల్ న్యాయవాదులు కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు ఆయన సోమవారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్యానల్ న్యాయవాదులతో వర్క్ రివ్యూ నిర్వహించారు. కక్షిదారులకు ఉచితంగా వాదించే కేసులు పై ఆరా తీశారు. జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, కేసుల పరిష్కారాన్ని కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎన్‌వీ మునేశ్వర ప్యానెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

### తపాలా బీమా ఏజెంట్ల నియామకానికి ఇంటర్వ్యూలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీల సేకరణ నిమిత్తం ఏజెంట్ల నియామకానికి జూలై 07, 08 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఏలూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ సురకత్తుల శ్రీకర్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 18 సంవత్సరాలు నిండిన వారై ఉండాలని, ఆసక్తి ఉన్న వారు ఒరిజినల్ సర్టిఫికేట్లు, బయోడేటాతో ఏలూరు పోస్టల్ డివిజన్ కార్యాలయం, అంబికా గుడి వద్ద, సత్రంపాడు, ఏలూరు–7 అడ్రస్‌కు ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 88853 35548లో సంప్రదించాలని పేర్కొన్నారు.

# జగన్నాథ రథయాత్రకు సర్వం సిద్ధం

- నేడు ఏలూరులో మూడోసారి యాత్ర
- భారీగా పాల్గొననున్న భక్తులు



జగన్నాథ, బలదేవ్, సుభద్ర విగ్రహాలు



గత ఏడాది నగరంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్ర (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో మూడో సారి జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నారు. జూలై ఒకటో తేదీన నిర్వహించే రథయాత్రకు ఇస్కాన్ ప్రతినిధులు భారీగా ఏర్పాట్లు చేశారు. శనివారపు పేటలోని ఇస్కాన్ మందిరం వద్ద నుంచి యాత్ర ప్రారంభం కానుంది. రథానిన సుందరంగా ముస్తాబు చేశారు. మందిరం వద్దకు ఆదివారం చేరుకున్న రథాన్ని, రథంలో నగర యాత్ర చేయనున్న జగన్నాథుడు, జగన్నాథుని సోదరుడు బలదేవ్, సోదరి సుభద్ర ఉత్సవ విగ్రహాలను నగరానికి చెందిన పలువురు భక్తులు సందర్శిస్తున్నారు.

**రథయాత్ర సాగేదిలా..**

జగన్నాథ రథయాత్ర నగరంలోని అన్ని ముఖ్య ప్రాంతాలనూ కలుపుతూ ముందుకు సాగనుంది. లునాని పార్కు వద్ద ఉన్న ఇస్కాన్ మందిరం నుంచి మధ్యాహ్నం 1.30 గంటల నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర అశోక్ నగర్‌లోని ఆయుష్ ఆసుపత్రి, డీమార్ట్ రోడ్డు, వెంకట్రామా థియేటర్ రోడ్డు, రామచంద్రరవు పేట ప్రధాన రహదారి మీదుగా ఫైర్ స్టేషన్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడి నుంచి ఓవర్‌బ్రిడ్జి మీదుగా ఒన్‌టౌన్‌లోకి ప్రవేశిస్తుంది. వన్‌టౌన్‌లోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ రాత్రికి స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణానికి చేరుకుంటుంది. యాత్రను ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభిస్తారని, ఇప్పటికే వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 400 మంది ఇస్కాన్ ప్రతినిధులు నగరానికి చేరుకున్నారని, వీరితో పాటు నగరానికి చెందిన జగన్నాథుని భక్తులు యాత్రలో నడువనున్నట్టు ఏలూరు ఇస్కాన్ మందిర అధ్యక్షులు రాధావల్లభ దాస్ తెలిపారు. యాత్ర భక్తులు నృత్యాలు, కీర్తనలు, గానాలు, కోలాట ప్రదర్శనలతో నగర వీధుల్లో ఆనందోత్సాహాల మధ్య నిర్వహిస్తామన్నారు.

**రామకోటిలో ప్రత్యేక కార్యక్రమాలు**

రథయాత్ర రామకోటి ప్రాంగణానికి చేరుకున్న అనంతరం అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 7 గంటల నుంచి రామకోటి ప్రాంగణంలో స్వామి వారికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ నైవేద్యం సమర్పించనున్నారు. అనంతరం నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు శుకదేవ మహారాజ, ఖమ్మం ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు నిత్య యుక్త దాస్, తిరుపతి ఇస్కాన్ టెంపుల్ సెక్రటరీ లీలాపరాయణ దాస్‌లు జగన్నాథ, బలబద్ర, సుభద్ర మహరాణి కథా ప్రవచనం, భక్తులందరికీ జగన్నాథ అన్నప్రసాద విందు ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

# వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



మాజీ ఎమ్మెల్యేను కలిసిన జాలిపూడి నాయకులు



మాజీ ఎంపీని కలిసిన పార్టీ నాయకులు

దెందులూరు : వైఎస్సార్ సీపీ బలోపేతానికి, పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయనను పార్టీ బీసీ సెల్ రాష్ట్ర నాయకులు, కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఎం సూర్య నారాయణ, దెందులూరు జెడ్పీటీసీ లీలా నవకాంతం గంగరాజు, సంపంగి శ్రావణ్‌లు కలిశారు. బీసీల సమస్యలు తోపాటు ఇటీవల ఏలూరులో విజయవంతమైన యువజన పోరు కార్యక్రమంపై శ్రీధర్‌కు వివరించారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**

జాలిపూడి గ్రామ సమస్యల పరిష్కారంతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామ సర్పంచ్ నవ్య ఆధ్వర్యంలో పార్టీ గ్రామ నాయకులు గంజి జేమ్స్, ఎం శివ, తోటినపుడు బెంజిమెన్, మాతంగి బాలు, కాండ్రు గణేష్, కాకర్ల వినోద్, వంశీ, గుడిపూడి నాని, గంజి సురేష్, పార్టీ ఏలూరు రూరల్ మండల అధ్యక్షులు తేర ఆనంద్‌లు అబ్బయ్య చౌదరిని కలిశారు.

### ఉద్యోగ విరమణ సత్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరపాలక సంస్థలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన దువ్వారపు కేదారేశ్వర స్వామికి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సత్కార సభ నిర్వహించారు. ఏపీటీఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు తదితరులు ఆయన సేవలను కొనియాడారు.

# కౌన్సిల్‌లో 10 అంశాలకు ఆమోదం





మేయర్ నూర్జహాన్, కౌన్సిల్ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన సోమవారం సాదాసీదాగా జరిగింది. అజెండాలో పొందు పరచిన 10 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కలెక్టర్ లేఖను అనుసరించి మెడికల్ కాలేజీ విద్యార్థులు హాస్టల్ నిర్మాణానికి రెండెకరాల 20 సెంట్ల స్థలం కేటాయించేందుకు, అల్లూరి సీతారామరాజు స్టేడియంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణకు ఉపయోగించే క్లాప్ వెహికల్ల బకాయిలు రూ.3.12 కోట్లు చెల్లింపునకు, దెందులూరు సమీపంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పునర్నిర్మాణం, గట్ల బలోపేతానికి రూ.5.14 కోట్లుతో పనుల చేపట్టేందుకు సభ్యులు మోదించారు. 2023 – 24 సంవత్సరాలకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రెండో ఇన్‌స్టాల్‌మెంట్‌లో టైడ్, అన్ టైడ్ గ్రాంట్ కింద వచ్చిన నిధులతో నిర్వహించే పనులకు ఆమోదం తెలిపారు. అశోక్ నగర్‌లో ఉన్న శాంతి వనం అశోక్ నగర్ బరియల్ గ్రౌండ్ డెవలప్‌మెంట్ సొసైటీ అభ్యర్థన మేరకు బరియల్ గ్రౌండ్ అభివృద్ధి, నిర్వహణ బాధ్యతలు అప్పగించామని మేయర్ నూర్జహాన్ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కమిషనర్ ఎ.భానుప్రతాప్, అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఎంఈ ఈ.సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

### గిరిజనులకు న్యాయం చేయాలి

జంగారెడ్డిగూడెం: గిరిజనుల సాగులో ఉన్న 1/70 చట్ట భూములను వివాదాల్లో ఉన్న భూములను అక్రమ పద్ధతిలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూమికి భూమి కింద సేకరిస్తున్నారని ఈ భూ సేకరణ తక్షణమే నిలుపుదల చేయాలని గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు తెల్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వివాదాల్లో ఉన్న భూములను ఆర్అండ్ఆర్‌లో కొనుగోలు ఆపాలన్నారు.

# జనసేన ఏలూరు నగర అధ్యక్షుడి రాజీనామా



అప్పలనాయుడుకి రాజీనామా పత్రాన్ని అందిస్తున్న నరేష్

ఏలూరు (టూటౌన్): జనసేన ఏలూరు నగర అధ్యక్ష పదవికి నగిరెడ్డి కాశీ నరేష్ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడుకి ఆయన స్వయంగా అందజేశారు. ఆరేళ్లుగా జనసేన నగర అధ్యక్షునిగా కాశీ నరేష్ పనిచేస్తున్నారు. పార్టీ కార్యక్రమాలన్నీ తానై నడిపించుకుంటూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా తమకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే అభిప్రాయం పలువురు జనసేన నాయకులు, వీరమహిళల్లో వ్యక్త మవుతోంది. ఈ క్రమంలో కాశీ నరేష్ తన పదవికి రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. నామినేటెడ్ పదవుల్లో జనసేన శ్రేణులకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే అభిప్రాయం నాయకుల్లో ఉంది. అసంతృప్తితో రాజీనామా చేశారా? లేక వేరే ఇతర కారణాలతో రాజీనామా చేశారా అనేది తెలియాల్సి ఉంది. పదవికి రాజీనామా చేసినా పార్టీలో కొనసాగుతానని కాశీ నరేష్ చెబుతున్నారు.

# లేబర్ కోడ్ల రద్దు కోరుతూ 9న సమ్మె



సమ్మె పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. సీఐటీయూ స్థానిక జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా సమావేశంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా లింగరాజు, ప్రసాద్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలని డిమాండ్ చేశారు. సమ్మె సందర్భంగా పట్టణ, మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలో వందలాది మంది ఉద్యోగ కార్మికులతో ప్రదర్శన, సభలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను కార్పొరేట్లకు, ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా మోదీ ప్రభుత్వం అప్పగిస్తోందని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సమ్మె ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ, సమ్మె విజయవంతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.రాజు, ఎం నాగమణి, వీవీఎన్ ప్రసాద్, కె.విజయలక్ష్మి, ఎస్ రాంబాబు, వై సాయికిరణ్, ఎం.దుర్గారావు, పి.సూర్యారావు, హనుమాన్లు, ఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# తపాలా ఇండిపెండెంట్ సెంటర్ ప్రారంభం



ఐడీసీని ప్రారంభిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీకర్ బాబు

ఏలూరు (టూటౌన్): ఏలూరు ఆర్ఆర్ పేట, పోస్టల్ శాఖ పార్సెల్ హబ్ బిల్డింగ్‌లో ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్ (ఐడీసీ)ను ఏలూరు తపాలా సూపరింటెండెంట్ సురకత్తుల శ్రీకర్ బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐడీసీ ఏర్పాటు ద్వారా ఏలూరు నగరంలోని ఏలూరు పెద్ద పోస్ట్ ఆఫీస్, వెంకటరావు పేట, నరసింహారావు పేట, ఏలూరు రైల్వే స్టేషన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న పోస్ట్‌మెన్ సిబ్బంది ఒకే కేంద్రం నుంచి ఉత్తరాల బట్వాడా చేయనున్నట్టు చెప్పారు. పోస్ట్ మాన్ సిబ్బందికి మోటార్ బైకులపై వెళ్లే వెసులుబాటు కల్పిస్తామని, ఈ ఐడీసీలో ఆదివారం, సెలవు దినాల్లోనూ ఉత్తరాల బట్వాడా కొనసాగుతుందని చెప్పారు. ఈ తరహా ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏలూరు అసిస్టెంట్ తపాలా సూపరింటెండెంట్ డి.శ్రీనివాసరావు, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ యు.చంద్ర శేఖర్, ఐడీసీ ఇన్‌చార్జి ఎం శ్రీనివాసరావు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్ బజార్, అగ్రహారం, న్యూ మార్కెట్, గజ్జెల వారి చెరువు ప్రాంతం, గడియార స్థంభం, కుండీ సెంటర్, నవాబ్ పేట, వెన్నవల్లివారి పేట, సత్యనాయారణ పేట, పెరుగు చెట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

### విద్యుత్ కోతలతో ఇక్కట్లు

దెందులూరు : ఏలూరు మండలం చాటపర్రు గ్రామంలో తరచూ విద్యుత్ కోతలతో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నామని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు ఎం పరశురాం ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరోజులో ఎన్నిసార్లు విద్యుత్ కోతలు విధిస్తారని ఆయన ప్రశ్నించారు. పదే పదే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో వృద్ధులు, చిన్నారులు, రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తక్షణమే సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఆయన కోరారు.

### పోలీస్ అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



పోలీస్ అధికారులను సత్కరించిన ఎస్పీ శివకిషోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పదవీ విరమణ వీడ్కోల సభకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్ శేఖర్‌కు ఏఆర్ సిబ్బంది గౌరవ వందనం చేసి వీడ్కోలు పలికారు. అనంతరం ఎస్పీ శివకిషోర్, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఘనంగా సత్కరించారు. ఏలూరు సీసీఎస్ ఎస్సై బుద్దాల శ్రీనివాసరావు, డీటీసీ ఎస్సై ఎస్ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ బి.సత్యనారాయణ పదవీ విరమణ చేయగా, వీరిని ఎస్పీ ఘనంగా సత్కరించారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ ఎలాంటి రిమార్కులు లేకుండా పనిచేయటం అభినందనీయమని ఎస్పీ కొనియాడారు. ఆర్ఎస్ఐగా పోలీస్ శాఖలో బాధ్యతలు స్వీకరించి ఏఆర్ అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది విధుల్లో ఎస్ఎస్ఎస్ శేఖర్ మంచి పేరు తెచ్చుకున్నారని అభినందించారు. ఉత్తమ సేవలు అందించి నేడు పదవీ విరమణ చేస్తున్న ప్రతి అధికారి, సిబ్బంది సేవలను ఎస్పీ ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, సీసీఎస్ సీఐ వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ సీఐ హబీబ్ బాషా, ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ నాగేశ్వరరావు, నాయకులు శానం విజయ్‌మోహన్, పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబాలు, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 30 | అరటి కాయ (1) | 06-08 |
| వంకాయలు (గులాబీ) | 36 | చిక్కుడు కాయలు | 70 |
| వంకాయలు (కాంతులు) | 40 | బీర్లదిక్కుడు | -- |
| వంకాయలు (తెలుపు) | 40 | చామదుంపలు | 36 |
| బెండకాయలు | 40 | ములక్కాడలు | 08, 10 |
| పచ్చిమిర్చి | 34 | కంద | -- |
| కాకర కాయలు | 40-50 | బీట్‌రూట్ | 40 |
| బీరకాయలు | 30 | కీరా దోస | 40 |
| బీరకాయలు (పందిరి) | 40 | ఫ్రెంచ్‌బీన్స్ | 96 |
| క్యాబేజీ | 24 | అల్లం | 60 |
| క్యారెట్ | 38 | కొత్తిమీర (కట్ట) | 20 |
| దొండకాయలు | 36 | పాలకూర | 12 |
| బంగాళదుంపలు | 30 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 28 | చుక్కకూర | 12 |
| గోరుచిక్కుడు | 40 | గోంగూర | 07-10 |
| దోసకాయలు | 20 | పుదీనా | 05 |
| ఆనబకాయ (1) | 10-15 | క్యాప్సికమ్ | 90 |
| పొట్లకాయ(1) | 20 | చిలకదదుంప | 40 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 37 |
| ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 38 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 41 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్) | 22.30 | 27 |
| ఏలూరు - అమరావతి (ఇంద్ర) | 19.00 | రద్దు |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో 22సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 22 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.15 | 4822 | 19 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 32 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 10.45 | 4798 | 23 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 21.15 | 4802 | 27 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 33 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 24 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 34 |